# ఉగాది

పండుగలన్నిటిలో ఉగాదికి ఒక ప్రత్యేక స్థానం ఉంది. ఏ సమావేశానికైనా, ఏ సభకైనా ముఖ్యఅతిథిని ముందుగా ఆహ్వానించడం పరిపాటికదా. అదే విధంగా సంవత్సర ప్రారంభంలోనే ఉగాది పండుగ జరుపుకోడంలో ఆ గొప్పతనం కన్పిస్తుంది.

పాతని పక్కకి త్రోసి, కొత్తకి బాటలు వేసే పండుగ ఉగాది. జీవితంలో సుఖదుఃఖాలు, మంచిచెడ్డలు కలగలుపుగా ఉంటాయనే సత్యాన్ని చాటిచెప్పే వేపపువ్వు పచ్చడి తినిపించే పండుగ ఉగాది.

కొత్త పంచాంగం చేతబడగానే నమ్మికున్నా, లేకున్నా కందాయఫలాలు, రాజ్యపూజ్య అవమానాలు చూసుకోనివారుండరు. నూతన సంవత్సరం తమ కోసం ఏ కొత్తరుచులు దాచి ఉంచిందా అనే కుతూహలం చూపనివారు ఉండరు. ధనిక-దరిద్ర వ్యత్యాసం లేకుండా అందరికీ ఆశను, ఉత్సాహాన్ని పంచి ఇచ్చే పండుగ ఉగాది.

బ్రతుకు బరువు మోయలేని మనిషి భావిలోకి ఆశగా చూడడం, రాబోయే కాలం గురించి తియ్యగా ఆలోచిస్తూ, దాని ఆగమనం కోసం ఉత్సాహంగా ఎదురు చూడడం సహజం. కాని, ఎదురుచూసినంత మాత్రాన ఏదీ వచ్చి చేతిలో పడదు. ఫలితం పొందాలంటే పరిశ్రమ కావాలి. స్త్రీ పురుషులు ప్రగతి మార్గానికి పథకాలు వేసుకొని వాటిని అనుసరిస్తూ పోతే, నిన్న కన్న, నేడు కన్న రేపు కాంతిగా ఉంటుందనీ, శాంతిని కలుగజేస్తుందనీ ఆశను, ధైర్యాన్ని పురికొల్పే పండుగ ఉగాది.

గడచిన సంవత్సరంలోని కష్టనిష్ఠూరాలకి, పూజ్యావమానాలకి ఫుల్‌స్టాప్ పెట్టి, ఈనాటి నుండి మళ్లా కొత్త జీవితం మొదలుపెట్టు, కొత్త డైరీలో సంతకం చెయ్యి, పండుగకి ఇల్లు కడిగి ముగ్గులు పెట్టుకొన్నట్లే మనసులోని మలిన భావనలు పారద్రోలి మంచికి అంకురార్పణ చెయ్యి అని బోధిస్తుంది ఉగాది పండుగ.

ఇదే ఉగాది మనకి అందించు సందేశం. మంచికోసం మనుగడ సాగించే ప్రతివారికి శిరోధార్యమైన ఆదేశం.

దేశంలో ఇటీవల జరిగిన ఎన్నికల దృష్ట్యా ప్లవంగ సంవత్సరానికో ప్రత్యేకత ఉంది. స్వాతంత్ర్యం సముపార్జించిన కాంగ్రెస్ పార్టీని త్రోసిరాజని తొలగించి కొన్ని రాష్ట్రాలలో కొత్త పార్టీలు అధికారంలోకి వచ్చాయి. ఈ మార్పుకి ప్రజలు ఉత్సాహంగా ఆహ్వానం పలికారు.

హెచ్చిపోతున్న జనాభా సమస్యకి, విచ్చలవిడిగా సంచరిస్తున్న అవినీతి ఆర్భాటానికి, అణగారిపోతున్న సామాన్యుని ఆర్థిక స్థోమతకి, ఆకాశాన్ని అంటుతున్న ధరలవత్తిడికి,

ఈ చీడల నివారణకి వీరు వేసే మందులేమా, తీసుకోబోయే చర్యలేమా అని ఆశతో ఆత్రంగా దేశమంతా ఎదురుచూస్తున్నది.

ఇవి ఏ ఒక్కరోజులోనే, ఏ వ్యక్తివల్లో అదుపులోకిరాగల సమస్యలు కావు. సులువుగా పీకి పారవేయడానికి నిన్న, మొన్న మొలిచిన గడ్డి మొక్కలు కావు. భూమిలో లోతుగా వేళ్ళూనుకొని, శాఖలు ఉపశాఖలుగా పెరిగి, ఊడలుదింపుకొన్న మఱ్ఱిచెట్టువంటివి. కానీ ఏదో ప్రక్కనుంచి నరకడమంటూ మొదలవుతే ఏదోనాటికి దానిని కూకటి వేళ్లతో పెకిలించే అవకాశం కలుగక పోతుందా అనే ఆశ.

దేశంలో ఈసారి ఎన్నికలలో వచ్చిన మార్పు దానికి నాంది పలుకుతుందా? రెండు దశాబ్దాలుగా కాంగ్రెస్ పార్టీ అదుపులోకి తేలేని ఈ సమస్యలను కొత్తగా అధికారంలోకి వచ్చిన ఈ పార్టీలు చేసి చూపుతాయా? ఈ కఠిన పరీక్షలో జయాపజయాలను విచారించి మార్కులు వేసే అధికారం కాలానికి మాత్రమే ఉంది.

ఏమైనా ఈ ప్లవంగ సంవత్సరం సామాన్యుని జీవిత పరిధిని మరికాస్త విశాలం చేస్తుందనీ, అన్నపూర్ణ అని పేరుగాంచిన భారతదేశంలో ప్రజలు ఆకలిచావుల వార్తలు వినకుండా గడచిపోతుందనీ ఆశిద్దాం.

ఈ ఉగాదినాడు ఇంకేమైనా కోరుకోవాలనుకొంటే, ప్లవంగ ఉగాది పచ్చడిలో చేదు, పలుపుల పాళ్లు తగ్గి తీపిదనం నిండుగా ఉండాలనీ, ప్లవంగ సంవత్సరం ప్రపంచంలో శాంతిని నెలకొల్పాలనీ, ప్లవంగ పంటలు ప్రజల కడుపులు నింపాలనీ, ప్లవంగ వెచ్చని కౌగిట్లో సామాన్యుడు బడలిక తీర్చుకోవాలని, మంచి మనసుతో ఇంతకుమించి కోరవలసిన కోరికలేముంటాయి? ప్లవంగ సంవత్సరం మానవాళికి ఇచ్చే కానుకలేముంటాయి?